# వినతి

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

# వినతి

రచన

**వేమూరి వేంకట రామనాథం**

ప్రచురణ:

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**2013**

# VINATHI

**Vemuri Venkata Ramanatham**

T.T.D. Religious Publications Series No. 1010

© All Rights Reserved

*First Edition : 2013*

Copies :

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Office of the Editor in Chief,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

వేమూరి వేంకట రామనాథంగారి **"వినతి"** నూట ముప్పై పద్యాల లఘుకృతి. ఇందులో భారతి, తిరుపతి కొండ, గోపురశిల్పం, దర్శనం, డిబ్బెన, భగవద్గీత, పేదల బ్రతుకు మొదలైన పదిహేను శీర్షికల క్రింద చెప్పిన వృత్తాలున్నాయి. ఆ వృత్తాలలోని కొన్ని పదాలకు అర్థాలు వారే సమకూర్చారు.

1982లో తిరుమల తిరుపతి దేవస్థానం రామనాథంగారి "సన్నుతి" రచనను ప్రచురించింది. ఈ "వినతి" కూడా వీరిదే.

శ్రీ వేంకటేశ్వరునిపై చెప్పిన రామనాథం గారి పద్యాలు భక్తిభరితమైన భావావేశంతో కూడినవి. గుణగ్రహణ పారీణులైన పాఠకులు ఈ పుస్తకాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను.


తిరుపతి,
14.09.2012

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


| | | | పుట |
|---|---|---|---|
| 1. | భారతీ | … | 1 |
| 2. | ఈ రచనకు అంకురము | … | 2 |
| 3. | స్తుతి | … | 3 |
| 4. | తిరుపతి కొండ | … | 10 |
| 5. | గోపురశిల్పము | … | 14 |
| 6. | దర్శనము | … | 15 |
| 7. | నీ రూపు | … | 18 |
| 8. | డిబ్బెన | … | 21 |
| 9. | నీ అప్పు | … | 24 |
| 10. | మనస్సు | … | 25 |
| 11. | భగవద్గీత | … | 27 |
| 12. | పేదల బ్రదుకు | … | 31 |
| 13. | దుష్టకార్యములు | … | 34 |
| 14. | కడలి | … | 35 |
| 15. | మంగళము | … | 36 |



# భారతీ

ఉ. నీ కవితా ప్రవల్హిక ననర్గళ శక్తియుతమ్ముసేయుమా,
నీ కనుదోయి వెల్గు కరుణించుత నా రచనా పదమ్ములన్,
శ్రీకర వేంకటేశ నగజృంభిత పద్యములం దదృశ్య దీ
క్షా కలితమ్ముగా నిలుచు శక్తివి భారతి, నీకు మ్రొక్కెదన్. 1

ప్రవల్హిక = గూఢముగా నుంచబడిన యర్థము గల కావ్య విశేషము, అనర్గళ = అడ్డంకులేని, జృంభిత = వికసించిన, కలితమ్ము = ఎఱుగబడినది.

చ. పదముల సొంపె భారతిక పయ్యెట, శబ్దములోని భావ సం
పదయె చిరానురక్తి, పయిపల్కుల మించిన లోని సొంపులన్
చెదరని దృగ్విలాసములు చిందిన యట్టి యలంకృతుల్ శుభ
ప్రదములు, నూతనాన్వయము లందెదు నక్షర సంధి చిత్రముల్ 2

అనురక్తి = కూరిమి, సంధి = కూడిక, చిత్రముల్ = ఆశ్చర్యములు.

శా. వీణా గాన విలాసినీ, స్థిర దృశావిర్భూత శిష్టాక్షర
ప్రాణీ, గుప్తవిశేష భావకలితోల్లాసార్భటీ విస్సృత
శ్రేణీ, వేదరుతిప్రశాంతిమయ నిక్షేపార్ష విజ్ఞాన ధీ
క్షోణీ, శుద్ధ కవిత్వతత్త్వ విభవాస్తోకాగ్రణీ భారతీ! 3

ఆవిర్భూత = పుట్టిన, గుప్త = దాచబడిన, ఆర్భటి = మ్రోత, శ్రేణి = వరుస, రుతి = ధ్వని, నిక్షేప = నిధి, ధీ = బుద్ధి, క్షోణి = నేల, ఆర్ష = ఋషిది, అస్తోక = అల్పముకాని, అగ్రణి = ముఖ్యము.

* * *

# ఈ రచనకు అంకురము

ఉ. మాశశి వత్సలత్వ కుసుమార్ద్రతలో బరిమింగు హోములో
లేశము వేరు చేయుపని లేక స్థిరస్థితమైన వ్యగ్రతా
వేశము పొంగి మున్నువలె వృత్తపరంపర రేగె నా మదిన్,
కోశము విచ్చి రాలు సిరికుప్పల పోలిక వేంకటేశుపై.

శశి = నా కుమారుడు శశాంక, బర్మింగ్‌హోంలో ప్రొఫెసర్ (ఆలబామా యూనివర్సిటీలో)

నే నచ్చట నాలుగు నెలలు (జూలై – సెప్టెంబరు, 2010) ఉన్నాను.

స్థితము = ఉన్నది, వ్యగ్రత = ఒకట తగిలిన మనసు, కోశము = బొక్కసము.

* * *



# స్తుతి

చ. స్థిర మతి తోడ నిన్ దలచు తీరును నా స్తుతిలోన నిల్పుమా
స్వరగతి నీదు కీర్తనముపై సతతమ్ము లగింప జేయుమా,
గురుధృతి పొంగి నా హృదయకోశము విచ్చెడు నట్లొనర్పుమా,
తిరుపతి కొండపై కొలువు తీర్చిన దేవర! వేంకటేశ్వరా! 1

చ. ఎగురుచు నీదుకీర్తనము లెంతగ జేసిననేమి, దేవరా!
దిగవని నీదురాతిచెవి దిమ్మల దాటుచు నంచుదోచు, నీ
జగమున మూల నెచ్చటనొ సన్నగ చీమ చిటుక్కుమన్న నీ
యగణిత తీక్ష్ణమౌ చెవుల కందు నటంచు తలంతురే జనుల్ 2

శా. లేదా, నా మొఱ నిన్ను జేరినను, నీ లీలావిలాసమ్ములో
నాదారిన్ నను బొమ్మటంచు, నిక నే నాడో భవత్ప్రజ్ఞయం
దేదో భిన్న మదెంత స్వల్ప మయినన్ దీవించుటల్ నన్నటం
చాదేశింతువొ తెప్ప లెత్తకె, యగమ్యమ్ముల్ త్వదీయోద్ధతుల్. 3

చ. మనసున దాల్చి నీఘనత, మల్లియ గుత్తిమొదళ్ళలోన దా
గిన మకరంద బిందువు నొకింతగ తాకెడు నాస పొంది ఝు
మ్మున పెనుదీక్షమై వలయముల్ సలుపన్ దొరకొన్న భృంగ రీ
తిని, జపియింతు పున్నెములు తీరుచు నీ శుభనామమున్ సదా. 4

చ. తలచిన యంతనే తనువు దాల్చిన రక్షణరేఖ పోలికన్
విలసన మంది నట్లు భ్రమపెంచుచు నిల్చియు నిల్వనట్లు, నా
యలసిన నేత్ర యుగ్మమున కచ్చెరువున్ కలిగించుచుందువే,
చలనము సుస్థిరత్వమును చక్కిలిగింతలవోలె పూనుచున్. 5

చ. ఒకపరి నా సమక్షమున నుజ్జ్వల రూపములోన నిల్చి నా
వికసిత నేత్రయుగ్మమున వేడుక కల్పనజేసి, తోడనే

చకచక మాయమౌ సరణి సర్వము నీవగు నీకెచెల్లు, పా
లకుడవు ముజ్జగమ్ములకు, లక్షణయుక్త విధిక్రమమ్మునన్. 6

శా. ఈ పద్దెమ్ముల నన్నిటన్ గలదొకే వృత్తాంతమో దేవరా!
నీపై నా మనసందు పొంగు వినతిన్ నిర్వాహయుక్తమ్ముగా
చూపున్ మించిన వ్యగ్రతాప్రథిమతో సూచించుటౌనయ్య, నా
యోపున్ దాటిన నిర్మలోత్సుకతతో నుద్రిక్తసంతుష్టితో. 7

ఉ. పద్దెములెన్నొ వ్రాసితిని బత్తిని పల్కులలో కుదించుచున్,
బుద్ధికి తీరుదిద్ది యిటు మ్రోగుచు నుంటిని, విశ్వసృష్టిలో
విద్దెలు పల్కుదివ్యతకు వేసముదాల్చిన బొమ్మవీవయా,
ఇద్ది పరీక్షయౌ, తిరుమలేశ్వర! నీ కరుణానురక్తికిన్. 8

మ. కరుణాంభోధివి నీ వటం చెఱుగుదున్ కావ్యప్రబోధార్థ వి
స్తరముం జేసియె కాక నా మనసునం దల్లాడు స్వాభావిక
స్థిరసందేశము కారణమ్ముగ, జగత్క్షేమ ప్రదాతా, నినీ
వరుసన్ "సన్నుతి" కావ్యమందు తొలి శబ్దం బందె ప్రార్థించితిన్. 9

చ. పరిమితి లేని భంగముల వంటివి నీదు దయాప్రసన్న శీ
కరములు, వాటిలో తడిసి గంతులు వేయగలట్టి భాగ్యమా
దరువుగ నా కొసంగుము, సుధాస్నపితోజ్జ్వల దివ్యతా భ్రమాం
తరమున నీదు లాడ క్షణదర్పమునైన నొసంగుమా ప్రభూ! 10

చ. ఎన్నడు మర్త్యలోకమున నెచ్చట చూడని ధగ్ధగప్రభన్
కన్నులు మూసికొన్నపుడు కన్పడ దల్కినయట్లు, నీదు ప్ర
చ్ఛన్న బృహత్ దయా విభవ సాంద్రతలో మునుగంగ జేయుమా
క్రొన్ననలందు తేనెకయి కూడిన భృంగము పోలికన్ ననున్. 11

మ. సిరికిం జెప్పని తొందరన్ కరిని రక్షింపంగ పర్వెత్తి తం
చు రచించెన్ మును పోతనార్యుడు, నినున్ స్తోత్రమ్ము నిత్తెమ్ము ని



ర్భర నైర్మల్యము పొంగి చేయు జనులన్ లాలించవా నీ దయా
స్థిర సంప్రోక్షణ తోడ తిర్మలగిరిన్ సేవించు నీ భక్తులన్. 12

చ. తిరుపతి కేగి నీదు తొలిదేవళమందలి భవ్యవిగ్రహో
ద్ధుర నయన ప్రసారమున దొర్లు వియత్తల శోభలందునన్
స్థిరమతితోడ మున్గి భవదీయ కృపాధృతి నా మనోక్షితిన్
మెఱసిన దన్న భావమున నెంతటి తృప్త్యనుభుక్తి యబ్బునో. 13

చ. చినుకొక టాకసమ్ము గడి చింది యదృష్టము మీఱ రాలునో
తనపయి మెల్లనంచు నిరతమ్ము నొకే తపనన్ వహించి యుం
డిన చిఱుచిప్ప పోలిక, గడించిన పుణ్యఫలమ్ముగా చిరం
తనముగ నా మదిన్ మెలగునట్లు త్వదుజ్జ్వలమూర్తి కోరెదన్. 14

ఉ. వందన మయ్య దేవగణ వార్ధిని రత్నము బోలు దేవరా!
కొందల మందు డెందమున కోమలమైన యదృశ్యరక్షణన్
చిందెడు దీనరక్షక, గ్రసించెడి చింతను బాపి క్రమ్మఱన్
పొందని రీతి నా కభయముద్రను కూర్చుము వేంకటేశ్వరా! 15

చ. తిరుపతిలోన విగ్రహము తీరున కన్పడు వేంకటేశ్వరా!
నిరతము నీ మనోకుహర నిష్ఠిత తేజమువోలె నిల్వుమా,
దరియగ నీయనుగ్రహ నిధానము తిర్మలయాత్ర చేయకే
పరమ పవిత్ర హృన్నిశిత భక్తి మహత్వము నాకు కూర్చుమా! 16

ఉ. చెప్పిన దిద్ది ముందఱనె, చెప్పెద వెందులకోయి యంచు నన్
దెప్పెదవేమొ, నా తలపు తీరున దాగిన గాఢవాంఛ యే
చొప్పున నున్నదో తిరిగి సూచన సేయుట కాలకింపుమా,
కప్పుర మట్లు వెల్గి క్షణకాల మదృశ్యము కాని వాంఛయే. 17

ఉ. దేవు డొకండె వేఱయిన దేవళముల్ భువి నెన్ని యుండినన్,
కోవెలలోన కొల్చినను కూరిమి నింటనె పూజ చేసినన్,

ఏ విధి నెట్టి నామమున హృద్పరిశుద్ధిని నిన్ను మ్రొక్కినన్,
దైవ మటన్న భావమున తత్పరబుద్ధి ప్రధాన మంతియే. 18

మ. తగు విజ్ఞానము, జ్ఞానమున్ కలుగు మేధాశాలు లుద్దండ పా
రగు లూహింతురు మూడులోకముల యుల్లాసమ్ము చైతన్యమున్
సొగసున్ కూర్చెడు దివ్యశక్తి కెదియున్ రూపమ్ము లేదంచు, ప
న్నగ భూషాంచిత శంకరుం డనియు శ్రీ నారాయణుం డంచు నిం
పుగ నామమ్ముల గొల్చు వారి గురి యబ్బున్ దివ్యతాజ్యోతికే. 19

చ. ఇక మఱు జన్మ లెత్తు చిటనే పృథివీస్థల కూపమందునన్
సుకములు దుఃఖముల్ కుడుచు చుండెడి దుర్విధి లేని యట్టులన్,
వికసన చెందు జ్ఞాన పథ వీక్షణ భాగ్యము సాధ్యమౌనటుల్
ముకుళిత హస్త దీక్షమెయి మ్రొక్కెద, నీ దయ జూపుమా ప్రభూ! 20

మ. ఇది యత్యాశగ నీకు తోచునొకొ, సర్వేశా, వినన్ వేడెదన్
ఇది పృథ్వీతల మందు సంపదలకై జృంభించు లోభమ్ము కా
దిది సంఘమ్మున మేటి స్థానమును సాధింపంగ పేరాస కా
దిది సర్వమ్ము త్యజించి నీ కరుణ తృప్తిశ్రేయ మర్థించుటే. 21

చ. ఇది యది నాకు కావలయు నీయవ దేవర యంచు కోరికల్
మదిని కురంగ పుంజముల మాదిరి గంతులు వేయుచుండగన్
పదములు తొట్రుచున్ దుడుకు పర్వుల నేదియొ మించి పోయిన
ట్లుదయమువెల్గు ముందటనె లోకులు నిన్ గన వత్తు రెందఱో! 22

చ. ఎచ్చట నుండి వత్తురొకొ పృథ్వి కెఱుంగకవత్తు రుద్ధతిన్,
ఇచ్చట లభ్యమైన శ్రమ నేదొ యుపాయముతోడ పూనుచున్,
వచ్చిన యట్టులే తిరిగిపైన మెఱుంగక పోదు రెప్పుడో
యెచ్చటికో ధరన్ వదలి, యిచ్చటి వారల కార్తి కూర్చుచున్. 23



మ. నిత్తెము, వేంకటేశ్వరుడ, నీ పయి బత్తిని నిల్పియున్న నా
చిత్తము శైశిరానిలము చిందుల నూగిసలాడు తీవెయై,
కత్తెర పోటునన్ చినుగు కాగిత మట్టుల నున్న దిత్తఱిన్
ముత్తెము మాత్రమౌ నభయమున్ దయసేయు మటంచు వేడెదన్. 24

మ. పద్దెము లెన్ని వ్రాసినను భావనిసర్గ మహత్వ మీవయా,
విద్దెల నెన్ని నేర్చినను బీజపటుత్వ సమాఖ్య నీవయా,
సుద్దుల నెన్ని పల్కినను సున్నితమౌ నుడిమాత్ర మీవయా,
గద్దియనెక్క గల్గినను క్రమ నియోజన శక్తి నీదయా! 25

మ. మిన్నుల యెత్తులన్ దొలుచు మేడల లోతు పునాదు లీవయా,
క్రొన్నన లూడిపోక సుమరూపము నందుట నీదు కూరుపే,
వెన్నెల రేయి మబ్బుల చవిన్ బడకుండుట నీ విలాసమే
కన్నెకు జీవితాంతము సుఖమ్మిడు పెండిలి నీ కటాక్షమే. 26

ఉ. అంతము లే నటుల్ గల విహాయస గోళము నీదు సృష్టిలో
కొంతయె, ప్రత్యహమ్ము సరిక్రొత్త జగత్తులు దృశ్యమైనటుల్
వింతను గొల్పు శోధనలు విందుము; సత్య మొకండె కాదొకో,
అంతకు మూలకారణ మనంత నిధానము నీ మహత్వమే. 27

చ. వెలుగన కంతమున్నదె, స్రవించిన నిర్మలభక్తి భావ సం
చలిత కవిత్వధారకు పొసంగునె కట్ట, మనస్సులోన ను
జ్జ్వలముగ రేగుచున్న పరసాధన చింతకు నంతు కల్గునే,
వెలుగు పసందులో కులుకు పేర్చిన కోయిల కూర్మియున్నదే. 28

చ. పరిమితి లేని స్వచ్ఛతమ భావమ వీవు, దిశా సమస్తమున్
దొఱలు ననంత శోభవు, కనుల్ పసిగట్టని శుద్ధ నిత్యతా
స్ఫురణమ వీవు; విశ్వమును బ్రోచెడి మౌలికశక్తి యుక్తికిన్
తిరుపతి లోన సర్వహిత దీక్షను నిల్చు ననన్య రూపమా. 29

చ. భ్రమరము తేనెకై పడెడు పాటున పూవుల నెన్నొ ముట్టినన్
సుమములలో సువాసనకె చోద్యము గొల్పెడు సంపెగన్ మరం
ద మొక యలంతి బొట్టు కయినన్ దరి జేరదు; సృష్టి చిత్ర చో
ద్యముల నిదొక్కటై నటులు తట్టును, తిర్మల వేంకటేశ్వరా! 30

చ. ఇడుమల నీడలన్ పదము లీడ్చుచు, ముందుకు పోవుచున్నటుల్
నడచుచు, నెత్తుగా నిలిచి నట్టివి కొండల జూడలేక, చూ
పడలినయట్లు జీవితము బాటను ముళ్ళను చిక్కి కుంటుచున్
గడపెడునార్త వర్గముల కన్నుల వెల్గును కూర్చవా ప్రభూ! 31

శా. ఏ మండీయని వంగి పిల్చిన సరే, ఏ మయ్య యన్నన్ సరే,
ఏమోయీ యని చేరి పిల్చినసరే, ఏరా యటన్నన్ సరే,
ఆమూలన్ నిలుచుండి రాయివలె "ఊఁఊఁ" సవ్వడిన్ జేయకే
నీ మౌనాంకిత నిష్ఠ మున్గితివి, వందే వేంకటేశ ప్రభూ! 32

**అర్థములు**

1. ధృతి = ధైర్యము
2. అగణిత = ఎంచనలవికాని
3. ఉద్ధతుల్ = గర్వములు
7. ఓపు = ఓపిక, ఉద్రిక్త = విజృంభించిన, సంతుష్టి = సంతోషము
8. తీరు = విధము, అనురక్తి = కూరిమి
9. ప్రబోధ = మిక్కిలి తెలివి, విస్తరము = విరివి, స్థిర = నిలుకడైన
10. భంగములు = అలలు, శీకరములు = తుంపరలు, ఆదరువు = ఆశ్రయము, సుధాస్నపిత = అమృతములో స్నానము చేసిన, ఉజ్జ్వల = విరియునది, అంతరము = నడిమిచోటు, దర్పము = గర్వము
11. ప్రచ్ఛన్న = కప్పబడిన



12. నిర్భర = అధిక, సంప్రోక్షణ = పరిశుద్ధి చేయుట
13. భవ్య = శుభమైన, ధృతి = సౌఖ్యము, అనుభుక్తి = అనుభవము
14. గడి = ఎల్ల, చిరంతనముగ = బహుదినములది
15. కొందలము = కలత, గ్రసించెడి = మ్రింగెడి
16. కుహర = గుహ, నిష్ఠిత = చక్కగా నుంచబడిన, నిశిత = వాడియైన, నిధానము = పాతఱ
18. తత్పర = ఆసగల
19. ఉద్దండ = ఎక్కువగా, పారగులు = దరిచేరినవారు
20. కూపము = నుయ్యి, వీక్షణ = చూపు, దుర్విధి = చెడ్డయేర్పాటు
21. జృంభించు = విజృంభించు, శ్రేయము = శుభము
22. కురంగ = లేళ్ళు, పుంజములు = రాసులు
23. ఉద్ధతి = గర్వము, వైనము = ఉపాయము, ఆర్తి = దుఃఖము
24. అనిలము = గాలి
25. నిసర్గ = కలిగించుట, బీజ = విత్తనము, సమాఖ్య = యశము, సుద్దులు= వృత్తాంతములు, సున్నితము = కచ్చితము, నుడి = పలుకు, క్రమ = ఇంపైన, నియోజన = ఆజ్ఞాపనము
26. కూరుపు = ఘటన
27. నిధానము = పాతఱ
28. పొసంగునె = లభించునె, ఉజ్జ్వలము = వెలుగునది, పేర్చిన = విజృంభించిన, ఊర్మి = నొప్పి
30. చోద్యములు = ఆశ్చర్యములు
31. అడలిన = భయపడిన, ఆర్త = దుఃఖము నొందిన

* * *

# తిరుపతి కొండ

చ. ధరణిని దేవునిన్ గొలుచు తావులు లెక్కకు మించియుండినన్
తిరుపతి కొండకే చనెడు దీక్షను పూనెదరేలొ పెక్కురుల్!
సురలకు దక్కు స్వర్గతలశోభలు పొంగుచు చిందు చున్నవో
తిరుమల పర్వతాగ్రముల దీప్తిప్రసార విశేష మందునన్! 1

ఉ. ఎండలు కాచినన్ పవనమే గతి నెంతగ వీచుచున్న, నీ
కొండను చేరి నంతనె యకుంఠిత నిశ్చల పంజరమ్ముగా
నుండును నా మనస్సు భవదుజ్జ్వల మూర్తిని లోన దాల్చి, నీ
యండ లభించి నట్లు తలపందును, నిక్కమొ లేక భ్రాంతియో! 2

చ. అది క్షణమాత్ర తృప్తి యగునా యనిపించును, కొండనుండి క్రిం
దదిగిన యావలన్ మనసు నందున ముందటి నీదు పొందులో
కదలిక యేదొ త్రుళ్ళినటు కంపము కల్గును, నిల్వ లేవ నా
చెదరు తలంపు కోణముల చిందు లడంచుచు, నిశ్చలమ్ముగా? 3

ఉ. ఆకస మంత కల్పతరు వందలి నిత్య మృదుత్వ గర్భితా
స్తోక మహత్వపూర్ణ సుమ శోభలు విచ్చి దిశాసమస్తమున్
ప్రాకిన వన్న యట్లు భ్రమ నందుదు తిర్మల పర్వతమ్ములన్
సోకిన చల్లగాడ్పులరుచుల్ మెయినంటినవన్న యంతనే. 4

చ. దిగితిని, కొండపైన గల దేవళమున్ మదిలోన నిల్పుచున్,
సగము నిమేషమైన కనజాలని తిర్మల వేంకటేశు సో
యగమును నాదుకంటిపస కందిన యంతకు తప్పిపోని రీ
తిగ నిలుపంగ జూచుచు కుదించిన ప్రజ్వల విశ్వమున్ బలెన్. 5

శా. ఏయే తావుల వీచియున్న పవన మ్మీనాటి కేతెంచె నీ
చాయన్ స్వల్ప విధమ్ముగానయిన యంచాహ్లాదమే తప్ప, ఆ
వాయుప్రాథమికోద్భవమ్ము పయినన్ ప్రశ్నాళి గుప్పింతుమే,
శ్రేయ మ్మబ్బునె యట్టి శంకలు మనోక్షేత్రమ్మునన్ పర్విన్? 6

చ. సురగణ వందిత మ్మయిన సుందర రూపము దాల్చి యెన్నడో
తిరుమల కొండపైన దిగి తిచ్చట భక్తజనాళి ముక్తి శీ
కరములు గద్దె కట్టినటు, కన్ను కదల్చని దివ్యతేజ సం
భరిత ముఖప్రకర్షమయ భాసుర నిత్య కటాక్ష వీక్షణన్. 7

చ. ముదుసలి నవ్వులం దొలుకు పుత్తడి పర్విన ముత్తియమ్ము సం
పదల మెఱుంగులో నిచటి పర్వత పంక్తి కపూర్వమైన సొం
పొదవిన యట్లు తోచు, తమ మ్రొక్కులు నేడు ఫలించె నన్నటుల్
ముదమున స్వామి దర్శన సముద్ధతినందగ వృద్ధయాత్రికుల్. 8

చ. తిరముగ నెల్ల తావులను తీరిచియున్నను, దివ్యతాద్భుతుల్
తిరుమల కొండపై నిలుచు దేవళ మందున స్వర్గలోక సుం
దరకళ లేవియో యమరి నట్టుల భ్రాంతి జనించు నుద్ధతిన్
పరువిడి వచ్చు యాత్రికుల భావనలోన, నదెంత మాయయో! 9

ఉ. ఎచ్చటనైన నిన్గను నదృష్టము మానవదృష్టి కుండినన్
ముచ్చట మీఱ పోదురు సముద్ధత బుద్ధిని తిర్మలాద్రికే
విచ్చిన దిక్సతీ నయన వీథుల వేకువకాంతులందునన్
చెచ్చెర కన్నులన్ దెఱచి నీ శుభదర్శనలభ్యతార్థమై. 10

ఉ. తర్కము మాట వేఱు, హృది దాల్చిన దీర్ఘ నిసర్గ భావ సం
పర్కము వేఱు, కొండకయి పర్వెడు వారిని జూడ వ్యక్తమౌ;
అర్కుని నూత్నమౌ కిరణ మందగ విచ్చెడి పద్మమున్ బలెన్
పేర్కొనలేని యుత్సుకత పెంపున వత్తురు నిన్ను కొల్వగన్. 11

మ. చలన మ్మందలి మార్దవమ్మున నవోషస్సుల్ విజృంభించగన్
నలు దిక్కుల్ పులు మాసినట్లు మెఱసెన్ రత్నాంగణమ్ముల్ బలెన్;
ఇలకున్ బ్రాణము గొల్పు భాస్కరు ప్రభాహేలాసమీపమ్ము క
న్నులకున్ గట్టు విధమ్ముగా ప్రకృతిలో నూత్నార్ద్రతల్ నిండె తి
ర్మల కొండన్ భవదీయ లోచన సుధామాధుర్య సంప్రోక్షణన్. 12

చ. తిరుమల కొండపై నెపుడు తీర్చితివో కొలు, వన్నిదిక్కులన్
పరిపర దూరదేశముల భారత పుత్రులు దైవచింతనో
ద్ధర పరితుష్టి సత్ఫలిత ధోరణిలో చెలరేగి వేంకటే
శ్వరునకు కోవెలల్ నిలుపసాగిరి పూర్వ మనః ప్రవృత్తిమై. 13

చ. తిరుపతి కొండకున్ జను నదృష్టము తగ్గిననేమి, నా హృదం
తరమునె యాలయమ్ముగ నొనర్చితి నెల్లెడ క్రమ్ము నీ మనో
హరతమ దివ్యతేజమున కచ్చటి వేంకటరూప మెంచుచున్,
స్థిరముగ నిద్ది రూపమని చెప్పగ నొప్పని దైవశక్తికిన్. 14

చ. తిరుమల కొండ గాడుపులు దివ్యుల శ్వాసల పోలికన్ మనో
హరములు, శాంతి సంగత మహత్వ మయమ్ములు, నాకలోక సుం
దర సుమరేఖలందలి సుధాస్రవధారల బోలు వేంకటే
శ్వర ముఖపద్మమం దలరు భవ్య నిరుక్త నిసర్గ హాసమున్. 15

**అర్థములు**

1. దీప్తి = కాంతి
2. అకుంఠిత = మొక్కపోవని
4. అస్తోక = అల్పముకాని, రుచుల్ = కాంతి
5. ప్రజ్వల = ప్రకాశవంతమైన



6. ఉద్భవమ్ము = పుట్టుట, క్షేత్రమ్ము = స్థానము
7. సురగణ = దేవతల సమూహము, శీకరములు = తుంపరలు, ప్రకర్ష = అతిశయము, భాసుర = ప్రకాశించునది
8. పుత్తడి = బంగారము, సముద్ధతి = గర్వము
10. సముద్ధత = గర్వించిన, చెచ్చెర = శీఘ్రముగ
11. నిసర్గ = స్వభావము, సంపర్కము = కలయిక, అర్కుని = సూర్యుని
12. పులు = అతిశయము, అంగణము = ముంగిలి, సంప్రోక్షణ = చిలుకరించుట
13. ఉద్ధుర = నిలుకడైన, పరితుష్టి = సంతోషము, ప్రవృత్తి = నడక
14. అంతర = నడిమిచోటు
15. సంగత = యుక్తము, స్రవ = కారుట, భవ్యహాసముల్ = శుభమైన వేదాంగ స్వభావ సిద్ధమైన మనోవికారములు

* * *

# గోపుర శిల్పము

ఉ. బంగరు గోపురమ్ము పయి(ప్రాత పురాణ కథా విశేషముల్
రంగము పైని నర్తనములట్టులు కన్నుల కట్టుచుండగన్,
ప్రాంగణమందు స్వర్గతలవాసుల జీవన ఘట్ట రమ్యతా
శృంగములన్ కనంగ నగు నిచ్చటి శిల్పకళా ప్రవల్లికన్. 1

ఉ. నీ శుభదర్శన మ్మయిన నిష్ఠిత హృద్ వినయ ప్రతిష్ఠితా
వేశములో ప్రదక్షిణము పేర్మి నొనర్చుచునున్న యప్పు డా
కాశములోన చొచ్చుకొను కాంచన గోపుర చిత్ర సంపుటిన్
లేశము సేపు చూచుచు నిలింపులగొల్చు నదృష్ట మబ్బెడిన్. 2

ఉ. శ్రీ లసితామర ద్యుతి విశిష్టముగా నెలకొన్నయట్టి గ
ర్భాలయ దివ్యతా స్ఫురణ కద్దముగా గల గోపురమ్ము శి
ల్పాలయ మిద్దియా యను తెఱంగున పూర్వ పురాణ గాథ లె
న్నో లలితప్రసారముల నూయెల లూపెడు నట్లు తోచెడిన్. 3

**అర్థములు**

1. ప్రాంగణము = ముంగిలి, శృంగములు = గుఱుతులు, ప్రవల్లిక = గూఢముగ నుంచబడిన అర్థముగల కావ్యవిశేషము.
2. నిష్ఠిత = చక్కగా నుంచబడిన, ప్రతిష్ఠిత = శాశ్వతముగా నిలుపబడినది, నిలింపులు = వేలుపులు.
3. శ్రీ = శోభ, అలంకరణము, ద్యుతి = కాంతి, విశిష్టముగా = కూడుకొన్న, నెలకొన్న = నిలుచుండు, ప్రసారము = వ్యాపనము.

* * *



# దర్శనము

చ. తిరుపతి కొండలన్ సురలు తీరిచి దిద్దిన యట్టులున్న సుం
దరమగు నాలయమ్మున కనంబడు నీదు గభీర మూర్తి నే
నరనిముసమ్ము సేపయిన నంజలి దాలిచి నిల్చి చూడ నీ
యరు గద, నీగుడిన్ నడపు నట్టి ప్రభుక్త నియుక్త బృందముల్. 1

చ. "పదపద" యంచు త్రోయు గుడి పాలకవర్గము వారి యూపులో
నడరుచు త్రుళ్ళి నేగనిన యట్టి శుభంకర విగ్రహమ్ము కన్
తుదలను జారిపో నటుల తూగుచు నూగుచు నిల్పియుంచి నా
హృదయము నందు నీ యతుల హేల బిగింపగ జూతు నాత్రతన్. 2

చ. తిరుమల పర్వతాగ్రమున దివ్య లదృశ్య ధృతిన్ శ్రుతిన్ నిరం
తరమును నీదు విగ్రహము తట్టున నిన్ను నుతించు దృశ్యమున్
తెఱచిన మూసినన్ కనుల నింపెడు సొంపును నింపు గూర్చు మం
చరమరలేని విన్నపము సల్పెద, నీచెవి కెక్కునో ప్రభూ! 3

చ. తిరుమల కొండకున్ జనిన దెన్ని దినమ్ములవెన్కనో, మన
స్సరసిని బెంగగా నలల సందడి లేదయినన్ సుమా, నిరం
తరమును తిర్మలేతర పథమ్ములసైతము భవ్య వేంకటే
శ్వరు మొగ మచ్చుకొట్టిన పసన్ దరిసించ గలాడ నౌటచే. 4

ఉ. నీ శుభదర్శన ప్రమద నిష్ఠిత తృప్తిని పొంగి జృంభితా
వేశముతో ప్రదక్షిణము వేడుక విచ్చిన రీతి చేయుచున్
లేశము సేపుగా నడరుతెప్పలు చాచి పవిత్ర శిల్ప సం
దేశములన్ కనుంగొనుచు నిల్చుచుపోదు రనేక యాత్రికుల్. 5

ఉ. నా పయి నింత మాత్రమగు నయ్య భవత్కృప, నన్ను వోలె నీ
రూపము తిర్మలన్ గన పరుంగిడి ప్రత్యహమున్ శ్రమించు భ
క్తాపగ కింత మించి తనియంగల మార్గము వేఱు లేదొకో!
ఆలయ పాలకాళి యనయ మ్మొనగూర్తురు క్రొత్త పద్ధతుల్. 6

చ. తిరుమల కొండపైన భవదీయ సుధాస్థిత విగ్రహ ప్రభా
ఝరి నొక బిందు వైనను నిసర్గఫలమ్ముగ నాకు దక్కినన్
గరువము పొంగు నా మదిని, కాంచితి నేలనె దివ్య రక్షకాం
కురముల దాగియుండిన యకుంఠిత దివ్యవిలాస మన్నటుల్. 7

చ. సురగణ సాధ్యమైన తవసుందర దృశ్యములోని శోభ యా
తిరుమల దేవళమ్మున కుదింపున దోచు నటన్న యూహ యా
తురపడు నా మనో ఫలక ధోరణి నుండు, నిదంతమాయయో,
స్థిరముగ నీ స్వరూపమట తీర్చిన బొమ్మను పోలునో, యదె
వ్వరి కెఱుకయ్య? నిన్గనిన వారలొ చెప్పెడు పెద్ద లిచ్చటన్! 8

శా. ఇందం దెందయినన్ కనంగ నగు నం చేనాటి పోతన్నదో
కందమ్మున్ పఠియించి యుండినను మూకల్ తిర్మలన్ జేర నా
నందావేశము లందుచుందు రిది యెన్నాళ్ళైన కించిత్తు మా
ర్పొందన్ నేరనిహైందవ ప్రకృతియౌనో, నీదు మాహాత్మ్యమో! 9

చ. తిరుపతి కొండపైన భవదీయ మహోజ్జ్వల దర్శనార్థమై
పరువున దూర భారముల పాటున కోరిచి యాలయమ్ము ముం
దఱ నిలుచుండి మెల్లగ పదమ్ముల సూపుచు నీ సమక్షమున్
దరియగ, లిప్త మించనటు దర్శన భాగ్యము నా కొసంగదే! 10



చ. ఇడుమల నీడలన్ పదము లీడ్చుచు, ముందుకు పోవు చున్నటుల్
నడచుచు, నెత్తుగా నిలిచినట్టివి కొండల జూడలేక, చూ
పడలినయట్లు జీవితము బాటల ముళ్ళను చిక్కి కుంటుచున్
గడపెడు నార్త వర్గముల కన్నుల వెల్గును కూర్చవా ప్రభూ! 11

ఉ. లేమిని జేసి సౌఖ్యరుచు లెట్టుల స్రుక్కిన, జీవితమ్ములో
క్షేమము ప్రాప్తి యెంతగ కృశించిన, తిర్మల కొండ యందునన్
సామిని చూడగా వలె క్షణమ్మయినన్ సగమైన యన్న వాం
ఛామననమ్మురేగు మనసందున పల్లెల పత్తనమ్ములన్. 12

**అర్థములు**

1. నియుక్త = నియోగింపబడిన
3. అదృశ్య = చూడబడని, ధృతి = సంతోషము, శ్రుతి = వేదము, అరమర= సందేహము
4. పథమ్ములు = మార్గములు, భవ్య = శుభమైన, పస = సమృద్ధి
5. నిష్ఠిత = ఉంచబడిన, జృంభిత = వికసించిన
11. అడలిన = భయపడిన, ఆర్త = దుఃఖము నొందిన
12. స్రుక్కిన = ముడుగు, తగ్గు; మననమ్ము = చింతన

* * *

# నీ రూపు

ఉ. కన్నులు మూసినన్ విరివిగా కనిపించెడు రూపునీది; నే
నెన్నడు ముందుగా కనని దెట్లని నేను తలంతు నట్టి రీ
తి న్నెలకొన్న పున్నెముల తిన్నెను బోలెదు; తిర్మలాద్రి మీ
దన్నిలువంగ లోకుల హితార్థము వచ్చితి వెన్నడో, ప్రభూ! 1

చ. ఎవరొ మనీషి చాతురి లభించగ కూర్చిన బొమ్మయౌనొ, మా
నవు డెఱుగంగ లేనటు లనాదిగ దేవు ననన్యమూర్తి సం
భవమయి యుండెనో యిచట పర్వత సంచయ మధ్యమందునన్,
ప్రవిమల దివ్యతా స్ఫురణ పర్వెడు నట్టులు నాల్గుదిక్కులన్ 2

శా. నీవీ తిర్మలలో స్వయంభువుగ మున్నేనాడు రూపొంది యు
న్నావో నే నెఱుగన్, నభోతలమునం దంతర్హితంబైన ది
వ్యావిర్భావము మానవోద్ధరణ రూపంబందెనో పృథ్విలో
నీవై, స్వర్గ విలాస దర్పణముగా నిర్వృత్తి సంధాతగా. 3

చ. జగతికి మూలకారణము సర్వ జనాభ్యుదయ ప్రదాత వీ
నగమున వేంకటేశుడను నామము దాలిచి నిల్చియుంటివే,
ఖగములు మంజుల స్వనవికాస సముద్గత కీర్తనమ్ములన్
సొగసుగ ఔక్కలన్ విసరుచున్న దివి ప్రతిరూప భూస్థలిన్ 4

ఉ. ఎన్నియొ కల్గినన్ నగల నెప్పటి కప్పుడు కల్పనమ్ము సే
యన్నవ భూషణమ్ములు త్వదాలయ పాలక నాయకాగ్రణుల్
కన్ను కదల్పకే, కనగ గంతులు వేయుచు వచ్చు వారికిన్
నిన్నటి కన్న మించినటు నీ శుభ దర్శనదీప్తి కూర్తువే! 5



ఉ. నీ ప్రణవ ప్రణీత సరణీద్యుతి కందము గూర్చు భావ రే
ఖాప్రసరమ్ముమై నిటు నగల్ పయి నింక నగల్ వెలార్చి యెం
తో ప్రణతిన్ ధనాఢ్యులు త్వదుత్సవ కేళిని పెంపు చేయు నూ
హాప్రకరమ్ముతో తివురు నట్టి యమాయక బుద్ధిసైచుమా! 6

శా. ఆ నీ విగ్రహమే యచంచలముగా నన్వర్థ శోభాయుత
ధ్యానాగారము వోలె నిల్వవలె నేత్రానందమై నా కడన్;
ఈ నా కోర్కి ఫలింపజేయునది నా హృన్నిశ్చలాసక్తియో,
నీ నైసర్గిక వత్సలత్వమొ, యొకే నిధ్యానమో రెండునున్! 7

మ. వివిధాభిఖ్యల నూర్ధ్వవాస గణమున్ వేర్వేఱు ప్రాముఖ్య గౌ
రవముల్ జూపుచు కొల్చు మానవుల దీర్ఘాచార మీ భారతీ
య విశాలక్షితిలోన నిల్చినది; అన్యప్రాంత వైశాల్య మం
దవలంబింతురు దేవ శబ్ద మొకటే యాకారమున్ గూర్చకే,
అవనిన్ మించిన స్వర్గమున్నదను నూహన్ కల్గియున్, దాని యం
దు వసించున్ పరమాత్మ శక్తి విధమం చూహించుచున్ భక్తిమై. 8

శా. లేరే లోకమునందు క్రైస్తవులు, ముస్లిం వర్గముల్, భక్తి య
ల్లారన్ కొల్వరె దేవరా యనుచు అల్లాయంచు, నందేవియున్
వేఱే నామములున్న దేవగణమున్ భిన్నమ్ములౌ రూపులం
దారాధించుట యున్నదే తమరి భక్త్యాచార మార్గమ్ములన్? 9

ఉ. రూపము లేని దివ్య తమ రోచియె విశ్వవిలాస సూచియన్
చూపు గలట్టి జ్ఞానము, విశుద్ధ మనస్థితి సర్వహిందు దృక్
దీపముగా వెలింగెడు నదృష్ట మపూర్వముగా లభించునో!
ఆ పరమక్షణ మ్మెపుడు నైనను హైందవ జాతి కబ్బునో!

**అర్థములు**

1. తిన్నె = వేదిక, హిత = మేలు
2. చాతురి = నేర్పు, సంచయము = సమూహము, ప్రవిమల = నిర్మలమైన, స్ఫురణ = తోచుట
3. స్వయంభువు = విష్ణువు, నభోతలము = ఆకాశము, అంతర్హితంబు = మఱుగుపడిన, ఆవిర్భావము = పుట్టుక, ఉద్ధరణ = మీదికెత్తుట, దర్పణము= అద్దము, నిర్వృతి = మోక్షము, సంధాత = కూర్చువాడు
4. ప్రదాత = ఇచ్చువాడు, సముద్గత = వెలి కుఱికిన, ప్రతి = సమాన
6. ప్రణవ ద్యుతి = ఓంకారముతో చేయబడిన వరుస యొక్క వెలుగు, ప్రసరము = వ్యాపనము, వెలార్చు = బయలుపఱచు, ప్రణతి = నమ్రత, ఉత్సవ = పండుగ, కేళి = క్రీడ, ప్రకరము = సమూహము, తివురు = కుతూహలపడు
7. ఆగారము = ఇల్లు, నైసర్గిక = స్వాభావిక, నిధ్యానము = చూపు
8. అభిఖ్య = పేరు, గణము = సమూహము
9. రూపులు = ఆకారములు
10. రోచి = వెలుగు, సూచి = అభినయ హస్త విశేషము

* * *



# డిబ్బెన

ఉ. డిబ్బెనలో రహస్యపు వడిన్ పరు లెవ్వరు చూడనట్లుగా
డబ్బును జార్చి దేవుడొక డయ్యది యెంతొ యెఱుంగురీతి, మో
ముబ్బి యపూర్వ తృప్తులయి ముచ్చట పొంగిన యూపు త్రోపులో
పబ్బము మీఱి నింటి వయిపై చను యాత్రికు లెందరో గదా! 1

శా. ఏయే మార్గములన్ గడించినదియో యీడిబ్బెనన్ రాలు సొ
మ్మేయే కోర్కెల బోనులో నిఱికి యేరే పైకముల్ రాల్చిరో,
సాయంబిచ్చునొ వేంకటేశుడు మహాశాగ్రస్తులై సొమ్ములన్
వేయం బూనిన యట్టి భక్తులకు, తానీ లంచమున్ మెచ్చునో! 2

చ. తిరుపతి కొండమీద వసతిన్ గొని డిగ్గిన యట్టి వేంకటే
శ్వరునకు లెక్క లేనటుల వచ్చిన సొమ్మున కాది యేదొ, యా
సిరిని సమంజసక్రియల సిద్ధికి మూలము చేయు వారికిన్,
పరిచిత మౌనె యెట్టి విభవమ్మున నా సిరి వచ్చు చున్నదో! 3

ఉ. ఉన్నవి చాల నట్టులుగ నుజ్జ్వల కాంతి ధగద్ధగా సము
త్పన్నముగా స్ఫురించు నవ వజ్ర సమన్విత కంఠహారముల్
కన్నులు బిత్తరించు తమకమ్మున నెప్పటి కప్డు కల్గు, నీ
దెన్నగ వీలు చిక్కని యదృష్టము, తిర్మల వేంకటేశ్వరా! 4

మ. భగవంతుండవు నీ కివెందులకయా, ప్రార్థింపగా వచ్చు భ
క్తగణమ్మైనను ముందు నిల్చు నొకలిప్తన్ నామ ముప్పొంగు నీ
మొగమున్ జూచుటకైన చాలదట, పోపొండంచు గొంతెత్తి మె
ల్లగ త్రోయన్ దొరకొన్న యాలయజనోల్లాస ప్రకర్షమ్ముమై. 5

చ. ఇతరు లెఱుంగకుండ నది యెంతయొ డిబ్బెనలో ధనమ్మిడన్
కుతకుత లాడు భక్తులకు గోచర మౌనొకొ, సత్త్వదృష్టియై

వితరణ మందు దాగిన పవిత్ర రహస్యము, వాంఛయన్న దే
గతిదిని లేని యట్టుల సుఖమ్ముగ నర్పణ చేయు విన్నటుల్ 6

ఉ. అంచెల మీద మొక్కుబడి నంగలు వేయుచు తిర్మలాద్రి కే
తెంచెదు భక్తబృందము మదిన్ స్ఫురియించునొ, ధ్యాన నిర్మల
త్వాంచల మాసయన్న దిసుమంతయు లేని సమత్వదృష్టియే
యం "చిది యిత్తు నాకొసగు మయ్యది" యంచు భజించ నేరకే. 7

ఉ. పైసలు నీకు గుప్పు ధనవంతు లెఱింగెదు నట్లు చేయుమా
ధ్యాసను నీ పయిన్ నిలుప నౌనని; యిందలి పూర్ణభావ మే
దో సరిగా నెఱుంగు దనియున్, భవదీయకృపామృతమ్ము పే
రాసకు చిందిరాలిపడు నంతటి చౌకది కాదటంచునున్. 8

చ. ఒరులకు చూపు దక్కనటు హుండిని పైకముబొత్తి జార్చు కొం
దఱు బహుళ ప్రయోజనమునందున బుద్ధిని చూపి ధర్మ కా
ర్యరతిని సంచరించరె! యెదైన రహస్యము దీన నున్నదో,
పరులకు మేలుకన్న భగవంతుని డిబ్బెన పున్నె మిచ్చునా? 9

మ. మన పుణ్యమ్మున తిర్మలాధిపులె యే మార్గంపు సొమ్మైన హుం
డిని పడ్డంతనె వేంకటేశ్వరుని వాణిజ్యమ్ములో లభ్యమౌ
ధనపావిత్ర్యము నొందెనా దలచి యెంతల్ సాంఘిక క్షేమ కా
రణమౌనట్టి వ్యయమ్ము లేర్చెదరొ సర్వశ్రేయ సంపన్నముల్! 10

చ. సిరికి గలట్టి శోభ యది చిల్కు జనోద్ధరణ ప్రభావమే,
స్మరణమె తప్ప చూపు కనజాలని నీ దయ కోసమై నిరం
తరమును హుండిలో దొఱలునట్టి ధనమ్ము లదృశ్యరీతిమై
గురుహిత దాయకమ్ములగు గోపురపాలక ధీవిచక్షణన్. 11



**అర్థములు**

4. సముత్పన్నముగా = ఎగసినట్లు, బిత్తరంబు = సరసమాడు, తమకమ్ము= త్వర
5. గణము = సమూహము, నామము = నొసటిబొట్టు, దొరకొన్న = యత్నించు, ప్రకర్షము = అతిశయము
6. వితరణము = దానము
7. అంచల = అంచు
9. రతి = అనురాగము
10. సంపన్నములు = సమృద్ధమైనవి, ఏర్చు = ఏర్పఱచు
11. ధీ = బుద్ధి

* * *

# నీ అప్ప

చ. తిరమగు ప్రేమలో మునిగి తేలెడు చక్కని చుక్క లచ్చిమిన్
పరిణయ మాడగా వలయు పైకము చాలక పూర్ణభాగ్య సం
భరిత కుబేరునొద్ద ఋణ మందితి వయ్యది యింక నిల్చెనో,
సిరి తన మారు పేరయిన శ్రీమతి ప్రక్కనె నిల్చి యుండినన్! 1

చ. ఇది కథ గాని, ముజ్జగము లేలెడి నీకె ధనమ్ములేక, నీ
యదనున కాధనాధిపుని నప్పును కోరెడు ముప్పుకల్గెనా?
అది తల తోకలేని కత లల్లుట బోలెడు, నల్లు వారిపై
పెదవులు త్రిప్పి నవ్వు కురిపింతువొ పూర్ణదయాస్వభావివై! 2

**అర్థములు**

1. తిరము = స్థిరము

* * *



# మనస్సు

చ. అటు నిటు చంచలమ్ముగ విహారము సల్పెడిదీ మనస్సు, వి
స్ఫుటముగ నన్ని కార్యముల పూనిక యందును కర్త పైకి నే
నటు కనిపించు చుండినను, నన్నుబికించెడి దీవు కాదె, యీ
కటువు సమస్య తీర్చగల జ్ఞానము నాకడ లేదు, దేవరా! 1

మ. యతులన్ ప్రాసలునున్ గణమ్ములును నొయ్యారమ్ముగా కూర్చుచున్
ప్రతిశబ్దమ్మును నర్థవంతమగు లీలన్ పేర్చుచున్, దాని మిం
చి తిరమ్మైన మనస్సు నీపయి, విపంచిన్ తీవెయున్నట్లు, కూ
ర్చితి, నా జీవన మార్గమందున స్థిర శ్రేయమ్ము కల్గించవే! 2

చ. మనసున నాసయున్, ఫలిత మందున తృష్ణయు, లేమియందు సాం
త్వనమున చింతయున్, సహజ భావము లట్టులరేగు, చక్కెరం
దున గల తీపి కోసమయి దొంతరలై చను చీమలట్టు, లిం
దొనరిన క్లిష్టతన్ తెలియు దుర్లభ భాగ్యము నాకు కూర్చుమా! 3

మ. తెలియున్ తిర్మలకేగి నంతనె భవద్విఖ్యాత కారుణ్య ని
శ్చల భాగ్యమ్ము తటాలునన్ కలుగు నంచాశించు టజ్ఞానమం
చెలమిన్ నిన్ దరిసించి మ్రొక్కుబడులన్ చెల్లింపగా వచ్చు మూ
కలకీ మౌలిక సత్యమర్థ మగునో కాదో జగద్రక్షకా! 4

చ. ఒడుదొడుకుల్ గ్రసించని హృదుజ్జ్వల నిశ్చలతా స్థితిన్, భ్రమన్
బడని వివేక లేశమున, భావన కందని నీదు మూర్తి నా
యెడదను తళ్కు మన్నటుల నెంచగలట్టి యదృష్ట మీయవా?
బడలని ధ్యాన నిష్ఠమెయి ప్రార్థనసేతును వేంకటేశ్వరా! 5

ఉ. ఆకుల ప్రోవులన్ వడిగ నంగలు వేయుచు గంతినట్లుగన్
చీకటి రాతిరిన్ జనెడు చిత్త విశేషము రెచ్చి మానవుల్
పోకడలోన త్రుళ్ళుచును పొంగుచు నుందురు జీవితాంతమున్
నీకమనీయ విగ్రహము నిత్తెము తెప్పలక్రింద నిల్పకే. 6

**అర్థములు**

1. విస్ఫుటముగ = స్పష్టముగ, కటువు = ఇంపు కానిది
2. తిరము = స్థిరము, శ్రేయము = శుభము
3. లేమి = దారిద్ర్యము, సాంత్వనము = ఓదార్చుట, ఒనరిన = కలిగిన
4. నిశ్చల = కదలని, ఎలమి = సంతోషము
5. ఒడుదొడుకుల్ = సమము కాని, వైషమ్యము; గ్రసించని = కవ్వని, అపహరించని; ఉజ్జ్వల = వెలుగునది
6. చిత్త = మనసు, విశేషము = అతిశయము, పోకడ = నడత, త్రుళ్ళుచు= ఎగిరిపడుచు

* * *



# భగవద్గీత

శా. గీతాగాధ విశిష్ట బోధనములో కేంద్రాంశ మాలోచనన్,
చేతన్, కల్గు ఫలమ్మునన్ మనసు సంక్షిప్తమ్ముగా "సత్త్వ" మం
దీతల్ వేయుచు నుండగా వలయు నంచీ స్పష్టమౌ సూత్రమం
దే తథ్యమ్ముగ బుద్ధినిల్పనగు, వేఱే లేదు మార్గమ్ము నీ
ప్రీతిన్ పొందగ నంచు కొండ జనువారిన్ నేర్వగా జేయుమా! 1

ఉ. గీత పఠించుచుంటినని యించుక గర్వము నంది నల్వురన్
ఖ్యాతి గడింప జూచు జనకాయ మెఱింగెదు నట్లు చేయుమా,
నీతి నిబద్ధ సత్త్వగుణ నిష్ఠకు కీరితి పేర్మి కెంతగన్
లోతగు నంతరమ్ము కలదో యని, తిర్మల వేంకటేశ్వరా! 2

ఉ. ఎటుల చరించగా వలయు, నెట్టుల లోని తలంపు వంపులన్
పటిమ తలిర్పగా నడచి పట్ట వలెన్, మొదలైన ప్రశ్నలన్
స్ఫుటమగు పాండితిన్ దెలియ జూచుచు సత్ఫలితమ్ము క్లిష్టమై,
కటిక తమస్సులో మునిగి కంపము చెందుచు నుందరే జనుల్! 3

చ. కలదొకటే శుభంకర వికాస యుతమ్మగు త్రోవ, సామి, చం
చల మగు నట్టి లోచన ప్రసారము కళ్ళెము వేసి పట్టి, ని
ర్మలమగు బుద్ధి నీపయి నిలంబడ జేయుటె పుల్ల శుద్ధియున్
వలసిన కార్యదక్షతయు పైకొన, సొంతఫలమ్ము నెంచకే. 4

మ. "భగవద్గీత పఠించుచుంటి" నని డంబందంగ నొనొక్కొ, దా
న గభీరాంశము లెన్నొ పాండితిమెయిన్ స్పష్టమ్మునా" కంచు సుం
తగ నైనన్ గరివించరాదు; మదిలోనన్ స్వార్థవాంఛాఝురీ
ప్రగతిన్ కట్టలుకట్టి నిల్పగల దార్ఢ్యమ్మెంతగా యోగ్యమో! 5

ఉ. చెప్పిన నీతిసూత్రముల చేవ మఱింగడు హెచ్చు గాదె, యా
చెప్పిన వా డనంత మగు సృష్టికె రక్షణ నిచ్చు వాడుగా
నొప్పిన యప్డు, దైవమె ప్రజోద్ధరణార్థము పల్కియుండె నీ
చొప్పునయన్న నమ్మకము సూదిని దారము వోలె చిక్కదే! 7

చ. ధరణిని రాజసక్రియలు, తామస భావవికార వర్తనల్,
పొరలుచు సాత్త్విక ప్రకృతి పోడిమి నీరసమందు చున్నటుల్
స్థిరమగు, క్షేమ వర్తనలు చిన్నెము మాత్రమునైన తెల్లమౌ
తరుణము లింకుచున్నవి, వృథావ్యసనమ్ముల గాటుపోటులో. 8

ఉ. దేవు డొకండె యెన్నయిన దేవళముల్, మఱి వాటియందునన్
పావన విగ్రహమ్ములకు నామము లేవయినన్ జనాళి యి
చ్ఛావివిధమ్ముగా కొలువ సాగుదు రంతియె; పూవులన్నియున్
పూవులెయైన నెవ్వరికి ముచ్చట కొల్పెడు పూవువారిదే! 9

ఉ. గీతను తెల్పగాబడెను కృష్ణుని నోటనె, తాను విశ్వ సం
ధాతయెయైన కొందఱు జనమ్ములు కొల్తురు వేఱుదివ్యులన్,
ఏ తెఱగైన వేల్పుల భజింతురొ చేరుదు రంచువారి; నీ
నీతిని పూర్తిగా నెఱుగ నేర, పఠించుచునున్ పదే పదే. 10

మ. నను ప్రార్థించిన వ్యక్తి చేరు నను, నన్యమైన దైవాళికిన్
వినతిన్ జేసెడివారు చేరుదురు వేత్వేఱైన దైవమ్ములన్"
అని కృష్ణుండె వచించె గాదె తన విశ్వాకారమున్ జూపు చ
ర్జును కాయాహవరంగ మందు కరుణాస్తోక ప్రభాజ్యోత్స్నలో. 11

చ. ఎచటనొ స్వర్గవాసులని యెంచెడి దివ్యవిలాసు లందునన్
కచటతపల్ వలెన్ వివిధ కక్షలు సంభవమౌనొ, జ్ఞాన సం



కుచితము నా దృశావధి కగోచర మియ్యది, భీష్మ మారుత
ప్రచలనలో వడంకు లఘు పత్రము నా మనసిట్టి ప్రశ్నపై. 12

చ. వివిధములైన నామముల వెల్గెడి దైవములందు శక్తి సం
భవమున భేదముల్ కలవొ, మౌలికదృష్టిని సర్వదైవ గౌ
రవములు నొక్కరీతివొ, విలాసము మించిన శక్తులందునన్
ధ్రువమగు తారతమ్య గతు లున్నవొ, నిక్క మెఱుంగ శక్యమే? 13

చ. తిరివడు నాకు నీదు తొలిదేవళమందలి భవ్యవిగ్రహో
ద్ధుర నయనప్రసారమున దొర్లు వియత్తల శోభ లందునన్
స్థిరమతితోడ మున్గి భవదీయ కృపాధృతి నా మనోక్షితిన్
మెఱసినదన్న భావమున నెంతటి తృప్త్యనుభుక్తి యబ్బునో! 14

ఉ. అంచెలమీద మొక్కుబడి నంగలు వేయుచు తిర్మలాద్రి కే
తెంచెడు భక్తబృందము మదిన్ స్ఫురియించునొ, ధ్యాన నిర్మల
త్వాంచల మాసయన్న దిసుమంతయు లేని సమత్వదృష్టియే
యం "చిదియిత్తు నా కొసగు మయ్యది" యంచు భజించనేరకే. 15

చ. తలచెద నుండి యుండి, గురుధార నమూల్యరహస్య మేదియో
తెలుపగ గీతలోన గల ధీస్మిత నిర్మలమైన శ్లోకముల్
పలికెడువాడు కృష్ణుడుగ, రంజనవంతములైన నీతి బో
ధల శ్రుతు లేర్పరించబడె తత్పరబుద్ధిని శ్రోత లెంచగన్. 16

**అర్థములు**

1. సంక్షిప్తముగా = చక్కగా గ్రహించునట్లుగా, తథ్యముగ = నిజముగ
2. కాయ = సమూహము, నిబద్ధ = బంధింపబడిన, నిష్ఠ = ఉనికి, అంతరము = భేదము, డంబు = గర్వము
3. పటిమ = నేర్పు, తలిర్చగా = చిగురించగా, తమస్సు = చీకటి
5. ఝరి = సెలయేరు
6. అంతరము = నడిమిచోటు, అగచాట్లు = ఇడుమలు
7. ఉద్ధరణ = పైకెత్తుట
8. ప్రకృతి = స్వభావము, పోడిమి = విధము, సౌఖ్యము
11. ఆళి = పంక్తి, అస్తోక = అల్పము కాని, జ్యోత్స్న = వెన్నెల
12. అవధి = మేర, పత్రము = ఆకు
13. సంభవము = పుట్టుక, కూడిక; గౌరవములు = గొప్పతనములు, ధ్రువము= ఎడతెగని
14. అనుభుక్తి = అనుభవము, తిరివడు = కలతపడు
15. అంచలము = కొంగు
16. గురుధార = గొప్పప్రవాహము, ధీ = బుద్ధి, స్మిత = చిఱునవ్వు, శ్రుతులు= మాటలు, శ్రోతలు = వినువారు, తత్పర = ఆసగల బుద్ధితో

* * *



# పేదల బ్రదుకు

ఉ. రంజనబాసి యాంగిక విలాసము డస్సి దివమ్ము జాలులో
గంజికి దిక్కులేని గతి కాలము బుచ్చుచునున్న వారి హృ
త్పంజర మందు నీ పయిని పర్వెడి నిశ్చల దృష్టి బోల్చి నీ
కంజదళాక్షి కోణమున కల్పన సేయుము మేలిదీవెనన్. 1

చ. అలసట యన్న మాటెఱుగ నట్టులు వేకువ లేచి సంజ గం
టల వఱ కూడిగమ్మున స్ఫుట స్థితులై తమచేతి కందు పై
సలు తమ పొట్టకూటికిని చాలక, యింటను వేచియున్న వా
రల గతి కేడ్చు పేదల నిరంతరశోకము బాపవా ప్రభూ! 2

చ. నిలువగ, నెండ మాడ్చు తఱి, నీడ నొసంగెడు కప్పులేక, యా
కలి నిడు పోటులో కడుపు కాలగ గుప్పెడు ముద్దగాని యం
బలియును లేదె, తీపు నిసుమంత యడంచగ, చూచుచుండి తి
ర్మలగిరిదేవ! నీ యభయ రక్షణ నించుకయేని కూర్చవే! 3

ఉ. ఎందులకయ్య భాగ్యసిత దృగ్విభవమ్మున తేలుచున్న ఖా
మందుల నీడనే కడుపు మాడి కృశించెడు నార్తజీవులన్
కొందల మందు డెందముల కోట్లకు కోట్లుగ కుందుచుండి నీ
ముందె నిలంబడన్ గనియు ముత్తెము మాత్రము సాయ మీయవే. 4

చ. అది తమ కర్మ, పూర్వ జననాగతకార్యఫలమ్మటంచు, న
య్యది పరిమార్చు శక్తి తమయందె యదృశ్యముగా స్థితమ్మటం
చెదొయొక గూఢ తర్కము వచించుచునుందురు పండితోత్తముల్,
బెదరుచు లేమి లోతుల చరించు నభాగ్యులకేమి సేమమో? 5

చ. తిరుపతి కొండపైన భవదీయ శిలాద్యుతి క్రమ్మియున్న మం
దిరమున నీ సమక్షముననే నిముసమ్మొ నిలంబడంగ సు
స్థిరమగు కాంక్షతో నరుగుదెంచెడి బృందములందు నిండు పే
దరికము వాడి కోఅలవెతన్ బడియుండిన ఖిన్ను లెందరో! 6

ఉ. పేదతనమ్ము పోటుపడి విహ్వలచిత్తపు గాటుదాటులో
నీదుచు జీవితాంబుధిని నిండిన కష్టతరంగ డోలలో
నీ దయ కోసమై ప్రణతి నిండిన బేలహృదంతరంగమున్
మీదుగ దాల్చి కొండకు గమించెడి బీదల గోడు చూడవా? 7

ఉ. హే పరమాత్మ! నిన్ గొలువ నీ గిరి చెంతకు వచ్చువారిలో,
దాపున నున్న దీనజనతా స్థితిపై నొక చిన్న మేనియున్
చూపు, హితప్రవృద్ధికర శోధనయున్ వికసింపగల్గుచో
ఆపగపైన పద్మచయ మల్లుకు పోయినయట్టు లుండదే! 8

చ. తిరుపతి యాత్రలో తిరిగి తెచ్చిన దేమన, లడ్లు కాదు, దు
ర్భర తమమౌ పరిస్థితులవాటున పెల్లుగ డిల్లపోవు నెం
దఱొ తమ చెంతనే బ్రదుకునందలి తీపి లభించనట్లుగా
పరిపరి రీతులన్ బడెడు బాధల కన్రువు జార్చి చేతనౌ
తెఱగున సాయమీయగల దీక్షయటంచును వెల్లడించుమా! 9

చ. నిను నిముసమ్మునున్ జరుగ నేరని తొందరలోన జూచి, సాం
త్వనమున తృప్తి చంద్రికలు పర్వినటుల్ సుకమందు భక్తులం
దున, తమప్రక్కనే సతముదొర్లు తమస్సున క్రుళ్ళువారి జీ
వన పథమందు వెల్గు చిఱు వంతున కూర్చెడు నేర్పు పేర్చుమా! 10



**అర్థములు**

1. రంజన = రుచించునది, ఆంగిక = అంగము చేత కలిగినది, డస్సి = కృశించి, జాలు = అల్పప్రవాహము, కంజ = పద్మము
2. ఊడిగము = సేవ, నిరంతర = ఎడతెగని, స్ఫుట స్థితులు = స్పష్టమైన యునికి కలవారు
3. నిడు = దీర్ఘమైన, తీపు = యాతన
4. భాగ్యవమ్ము = అదృష్టముతో తెల్లని చూపు యొక్క సంపద, ఆర్త = దుఃఖము నొందిన, కొందలము = కలత, డెందములు = హృదయములు, కుందు = దుఃఖించు
5. ఆగత = వచ్చిన, పరిమార్చు = ఖండించు, స్థితము = ఉన్నది, గూఢ= రహస్యమైన
6. ఖిన్నులు = ఖేదము నొందినవారు
7. విహ్వల = భయాదులచేత అవయములు స్వాధీనము తప్పిన, దాటు = లంఘనము, గాటు = కారము, ప్రణతి = నమ్రత, మీదు = దేవతలకని నియమించిన ముడుపు
8. ఆపగ = ఏఱు, శోధన = వెదకుట
9. వాటు = దెబ్బ, పక్వము = పరిపాకము పొందిన
10. సాంత్వనము = అనునయము

* * *

# దుష్టకార్యములు

చ. ధరణిని తీక్ష్ణమైన పరితాపము గొల్పెడు దుష్టకార్య సం
భరిత ప్రవర్తనల్ పెరిగి మానవ ధీక్రమ చింతనమ్మె రూ
పఱిన కతమ్మునన్ ప్రకృతి యందె యపూర్వముగా విచిత్ర భీ
కర పరిణామ ఖేదములు కల్గుచు నున్నవి వేంకటేశ్వరా! 1

చ. జగతిని దుష్టకార్యముల జాడ్యము పెంపగుచున్న దేలనో,
ప్రకృతి విరుద్ధ సంఘటనలయ్యును; చేయుట తేలికౌటనో,
పొగిలెడు దీనవర్గముల పొందును పెంచుట యెట్లొ సూటిగా
నగపడ కుంటనో, తమము నందున నీలము ద్రాక్షలట్టులన్. 2

**అర్థములు**

1. ధీ = బుద్ధి, రూపఱిన = క్షయించిన, ఖేదములు = శోకములు
2. పొందు = పొంకము, తమము = చీకటి

* * *



# కడలి

చ. కడలికి క్రంత వద్ద దిది కాలము దూకుడులోన పూర్వ మె
న్నడు మనకెచ్చటన్ తెలియనట్టి విచిత్రము; కంటి కింపు కూ
ర్చెడి గురుభంగ సంచలన జృంభిత నిర్మల నీల శోభలన్
గడుసరి నూనె పొంగు చలనమ్ము లపూర్వముగా కనంబడెన్. 1

చ. సరసముగా పరుంగు లిడు సంద్రము పాయల వంపు వల్లియన్
విరిసిన సూర్యరశ్మి ప్రతిబింబము రేఖల తీర్పులో మనో
హర మగు శయ్యవోలె గగనావధి దన్కను పర్వునట్టులన్
బఱగిన వార్ధిభంగరుచి భంగము చెందిన యట్లు తోచెడిన్. 2

ఉ. తీరము మేర మీఱదను తీరును పేరును గల్గియున్నదీ
నీరధి, ద్రవ్యమేర్చు సరణిన్ భువి క్రంతల పాలుసేయు వ్యా
పారుల గుంపులో జన శుభంకర వర్తన నీతి దృష్టి పెం
పారెడునట్లు చేయుము నభమ్మున కూర్మిగ వేంకటేశ్వరా! 3

**అర్థములు**

1. భంగ = తరంగములు, జృంభిత = వికసించిన
2. తీర్పు = చక్కబాటు, అవధి = మేర, రుచి = కాంతి, భంగ = అల, భంగము = చెఱుపు
3. మేర = ఎల్ల, తీరు = విధము, ఏర్చు = ఏర్పఱచు, సరణి = వరుస, పెంపారెడు = సమృద్ధికలుగు, ఊర్మి = ప్రకాశము

* * *

# మంగళము

ఉ. పద్దెము వ్రాయు టాపినను భావము లేవియొ రేగుచుండవే
హద్దులు లేని పొంగుల నహస్సును రేయిని నా మనస్సునన్,
ప్రొద్దెటు లూగినన్ గుబురు పూవుల తేనెల తుట్టెలట్టులన్
నిద్దుర లేని ఫుల్లతను నిల్పవె నా హృదయాంతరమ్మునన్. 1

మ. మును నే వ్రాసిన "సన్నుతిన్" బలెనె యీ పొత్తమ్మునున్ గూర్చితిన్
వినతిన్ మ్రొక్కితి వేంకటేశ్వరుని రీవిన్; వందకున్ మించు రీ
తిని వృత్తమ్ముల నేర్పరించి, కల ధీశక్తిన్ కవిత్వమ్ము నం
దున గుప్పించుచు, నిర్మలోత్సవముతో నుల్లాస సంతుష్టితో. 2

ఉ. ఎన్నిదినమ్ము లాయె నొకొ యిన్ని హృదర్పిత పద్యజాలమున్
పన్ని శతాధికోద్ధతిని పక్వధృతిన్ రచియించి, శుద్ధ వి
ద్యున్నిభమైన తళ్కువడి, నూయెల లూగెడు భావసంభృతిన్
సున్నితమైన ధారను, విశుద్ధ మనస్సున, వేంకటేశ్వరా! 3

ఉ. మంగళ వృత్తమున్ హృదయమందలి నిశ్చల భక్తియుక్తి యు
ప్పొంగిన భంగి నల్లుదును, మూర్తినిదాల్చిన దివ్యతాంబుధి
ప్రాంగణ మందు నిశ్చలత పన్నిన నిర్మల నౌక పుణ్యమై,
వంగిన మావి కొమ్మపయి పాడుచు గంతెడు కోకిలన్ బలెన్. 4

ఉ. మంగళ శబ్ద సంకలిత మాలను నుత్పలమాలతో తుదిన్
వంగి నమస్కరించి, భువనమ్ముల రక్షక శక్తి వైన మా
చెంగలి వేంకటేశ్వర, భజించి యొసంగుదు నీకు ప్రార్థనా
భంగ మనోహరోజ్జ్వలిత వాహిని బోలిన పద్యకావ్యమున్. 5



**అర్థములు**

1. అహస్సు = పవలు, అంతరము = నడిమిచోటు
2. రీవి = వైభవము, ఉత్సవము = గర్వము
3. ఉద్ధతి = గర్వము, పక్వధృతిన్ = పరిపాకమునందిన సంతోషముతో, నిభము = సమానము, సంభృతి = చక్కగా ధరించుట, ధార = ప్రవాహము, విశుద్ధ = పరిశుద్ధమైన, వడి = వేగము
4. ప్రాంగణము = ముంగిలి
5. మంగళ = శుభమైన, సంకలిత = కూర్చబడిన, చెంగలి = సమీపము, ఉజ్జ్వలిత = విరిసిన, భంగ = అల.